సాక్షి కర్నూలు
శనివారం, 7, జూన్, 2025



స్పెషల్ 'అదెసివ్' స్టాంపుల కొరత

రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఈసీలు పొందడానికి అవసరమైన స్పెషల్ అదెసివ్ స్టాంపులు దొరకడం లేదు. 10లో▸



జనని బ్యాంకు పేరుతో మోసం

జనని బ్యాంక్ పేరుతో ఎక్కువ వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి డబ్బు తీసుకుని మోసం చేశారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,600.62
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 22.228
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 7,779
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 255

న్యూస్‌రీల్

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా రాధిక



కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బి.రాధికను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న 10 మంది డిప్యూటీ డైరెక్టర్లు, డీఎస్‌డబ్ల్యూఓలను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న రాధికను ఇక్కడకు బదిలీ చేశారు. రెండు నెలల క్రితం ఇక్కడ రెగ్యులర్ జేడీగా విధులు నిర్వహించిన జె.రంగలక్ష్మీదేవి అమరావతి డైరెక్టరేట్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తు వచ్చారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ఆలూరు: ఆలూరు మూడో సచివాలయంలో పనిచేస్తున్న ఐదుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డిప్యూటీ ఎంపీడీఓ, ఆలూరు ఈఓ వై.ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధులకు సకాలంలో హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే వారికి నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారు తప్పని సరిగా 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేదంటే జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

గురుకులాల్లో సీటు ఖరారు చేసుకోండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వెంటనే తమ సీటు ఖరారు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి కోరారు. ఇటీవల నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు జరిగిన పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందిన వారికి ఎంపిక ప్రక్రియ జరుగుతోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల రిజిస్టర్డ్ మొబైల్‌కు మెసేజ్ వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి తమ సీటును ఖరారు చేసుకోవాలని డీసీఓ కోరారు. మొదటి జాబితాలో అర్హత పొందిన వారు వెంటనే ప్రవేశం పొందాలని, లేనిపక్షంలో వారికి ప్రవేశం ఉండదన్నారు. ఈ నేపథ్యంలోనే రెండో జాబితాను వెంటనే విడుదల చేస్తామన్నారు.

రూ.1.18 లక్షల విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీరాఘవేంద్ర మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిమళ విద్యానికేతన్‌కు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన దివిజ హన్విక అనే భక్తురాలు రూ. 1.18 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆమెకు శేష వస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక అందజేసి ఫల పూలమంత్రాక్షింతలతో ఆశీర్వచనం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాలు విడుదల అయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది డిసెంబర్ 8న పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. మెరిట్ కార్డులు www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బ్యాంక్ అకౌంట్ తెరిచి విద్యార్థి ఆధార్‌ను లింక్ చేయించి డీబీటీ ద్వారా డబ్బులు జమ అయ్యే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మాకింత.. మీకింత..

- ఉపాధిలో మితిమీరిన అక్రమాలు
- 50 శాతం పైగా దొంగ హాజరు
- వారంలో చేసిన పని ఆధారంగా ముడుపులు
- ఫీల్డ్ అసిస్టెంట్లపై ఏపీఓ, ఈసీ, టీఏల ఒత్తిడి
- పాత ఫాంపాండ్స్‌కే మెరుగులు



➤ మంత్రాలయం నియోజకవర్గంలో ఓ మండలానికి ఈసీ ఇన్‌చార్జి ఏపీఓగా వ్యవహరిస్తున్నాడు. వారానికి లక్ష రూపాయల పని జరిగితే రూ.20 వేలు ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నాడు. మాకు ఇచ్చేది ఇచ్చి, మీరు ఎంతైన సంపాదించుకోండని 'అవినీతి' సలహా ఇస్తున్నాడు. లేదంటే ఒక్క రూపాయి కూడా సంపాదించుకోలేరని బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

అక్రమాల హాజరు!

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి నాయకులు ఉపాధి హామీ పనులను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు కాగానే అప్పటి వరకున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమ అనుచరులకు పట్టం కట్టారు. అది కూడా బేరం పెట్టి మరీ నియామకాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూడా తమ చెల్లించుకున్న మొత్తాన్ని రాబట్టుకునే దిశగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ మొదలు ఏపీఓల వరకు అన్ని కేటగిరీల ఉద్యోగులు అవినీతిలో మునిగి తేలుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీలో 50 శాతం పైగా దొంగమస్టరు వేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వారానికి లక్షకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు చర్చ జరగుతోంది. కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, తుగ్గలి, మద్దికెర, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం, హొలగొంద, ఓర్వకల్, క్రిష్ణగిరి, నంద్యాల జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, నందికొట్కూరు మండలాల్లో అవినీతి తంతు మితిమీరింది. టీడీపీకి చెందిన వారి ఇంట్లో ముగ్గురు, నలుగురు వరకు పనికి రాకపోయినప్పటికీ మస్టరు వేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం ఉపాధి పనులకు 97వేల మంది వరకు హాజరువుతున్నట్లు లెక్కలు ఉండగా.. వాస్తవానికి 40వేల మంది కూడా రావడం లేదని తెలుస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో.. 50 శాతంపైగా దొంగమస్టరు వేస్తున్నట్లు సమాచారం.



➤ కౌతాళం మండలం చూడి గ్రామంలో (వర్క్‌కోడ్: 0213001007/ఐసీ/19185010164922)ఉపాధి పనికి కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ మాత్రం ఏకంగా 28 మంది ఉపాధి పనికి వచ్చినట్లు మస్టర్(హాజరు) వేశాడు. అంటే రికార్డు స్థాయిలో 24 మంది పేర్లతో దొంగ మస్టర్లు వేయడం గమనార్హం.



సంజామల మండలం ఆకుమల్లలో మస్టర్ నెం.4513కి అప్‌లోడ్ చేసిన ఫొటో



అదే వ్యక్తిని మస్టర్ నెం.4514లోనూ చూపిన దృశ్యం

➤ సంజామల మండలం రెడ్డిపల్లెలో ప్రతి రోజు ఉపాధి హామీ పనులకు రాకపోయినా దాదాపు 50 మంది కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ తమకు అనుకూలమైన వారికి హాజరు వేస్తున్నట్లు సమాచారం. స్థానిక టీడీపీ వర్గీయులు పనికి రాకపోయినా హాజరు వేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. తాము వారం రోజులు పనిచేస్తే రెండు రోజులేచూపుతున్నారని, ఇంటి దగ్గర ఉన్న వారికి లబ్ధి చేకూరుస్తున్నారని పలువురు ఉపాధి కూలీలు వాపోతున్నారు.

.. ఉపాధి హామీ పథకంలో మితిమీరిన అవినీతికి ఈ రెండూ తాజా ఉదాహరణలు.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం, అధికార టీడీపీ నేతల జోక్యం అధికమవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దోపిడీ కొనసాగుతోంది.

పాత పనులకే మెరుగులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఫాంపాండ్ తవ్వకాలకు పెద్దపీట వేశారు. అయితే గతంలో తవ్విన ఫాంపాండ్‌లకు మెరుగులు దిద్ది వందల మంది కూలీలు పనిచేసినట్లు మస్టరు వేసి ఒక్కో కూలీ పేరిట రోజుకు రూ.307 స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రాలయం, పత్తికొండ, డోన్ నియోజక వర్గాల్లో ఈ తంతు పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ ఏడాది ఒక్క కర్నూలు జిల్లాలోనే 8,500 ఫాంపాండ్‌లు తవ్వాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 2వేల వరకు ఫాంపాండ్‌లు తవ్వారు. ఇందులో 75 శాతం పాత వాటికి మెరుగులు దిద్దినవే ఉన్నట్లు స్పష్టమవుతోంది.

పండ్లతోటల అభివృద్ధిలో అంకెల గారిడీ

- 2023-24 సంవత్సరంలో ఈ-క్రాప్ ప్రకారం 11,202 ఎకరాల్లో పండ్లతోటలు ఉన్నాయి.
- 2024-25లో ఉపాధి నిధులతో 4,150 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు అంకెల ద్వారా తెలుస్తోంది.
- మరోవైపు ఉద్యాన శాఖ కూడా దాదాపు 1000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు స్పష్టమవుతోంది.
- ఈ ప్రకారం 2024-25లో పండ్లతోటల సాగు భారీగా పెరుగాలి.
- ఈ-క్రాప్ ప్రకారం 2024-25లో 11,650 ఎకరాల్లో పండ్లతోటల సాగు ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- 2023-24తో పోలిస్తే 2024-25లో కేవలం 448 ఎకరాల్లోనే పండ్లతోటల సాగు పెరగడం గమనార్హం.
- ఈ విషయంలో నిధులు భారీ ఎత్తున స్వాహా అవుతుండగా.. నిర్వహణ(మెయింటెనెన్స్) బిల్లులు దారి మల్లుతున్నట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి పనులు కల్పించడం లేదు



మాకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. కానీ మా కుటుంబంపై వైఎస్ఆర్‌సీపీ ముద్ర వేసి ఉపాధి పనులు కల్పించడం లేదు. ఫీల్డ్ అసిస్టెంటు, ఏపీఓను కలిసినా ఫలితం లేకపోయింది. ఉపాధి పనులు కల్పించడంలో రాజకీయాలు చూడరాదు. ఒక పార్టీ, ఒక వర్గానికి మాత్రమే పనులు కల్పిస్తున్నారు. వ్యవసాయ పనుల్లేక, ఉపాధి పనులు దక్కక ఇబ్బందులు పడుతున్నాం.
– సుభాన్, ఉపాధి కూలీ, గుడికంబాలి, కౌతాళం మండలం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఉపాధి పనులకు వచ్చిన వారికి మాత్రమే మస్టర్లు వేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. దొంగమస్టర్లకు తావు లేకుండా తనిఖీలను ముమ్మరం చేశాం. ఫాంపాండ్స్ తవ్వకాల్లో అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు చేపడతాం.
– వెంకటరమణయ్య, పీడీ, డ్వామా, కర్నూలు

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'



- నేడు ఈద్ - ఉల్ -జుహా (బక్రీద్)
- పండుగ నిర్వహణకు ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు బక్రీద్‌ను జరుపుకుంటారు. త్యాగమయ జీవితమే మానవ జన్మకు సార్థకమన్న అల్లాహ్ ఆదేశాలు పాటించడమే ఈ పండుగ ఉద్దేశం. ఈ వేడుక రోజే సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగరంలో హజ్ కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు ముస్లింలు ఈ పండుగను సంబరంగా చేసుకుంటారు.

పండుగ ఇలా..

పండుగ రోజు ప్రతి ముస్లిం శుద్ధి స్నానం చేసి, కొత్త దుసస్తులు వేసుకొని వజూ చేసుకొని, 'అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్. లాయిలాహ ఇల్లల్లా. అల్లహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్'. అంటూ తక్బీ చదువుంకుంటూ ఈద్గాహ్‌లకు చేరుకుంటారు. అక్కడ ముందుగా ఖాజీ, మౌల్వీ, మౌలానా, హఫీజ్, ఇమామ్ చేత సహపంక్తి సమాజ్ చేసిన తరువాత అరబ్బీ ఖుద్బాహ్, ఉర్దూ బయాన్ చదువుతారు. పండుగ ఎప్పుడు ఎలా ఏర్పడింది.. ఎందుకు చేసుకుంటారనే విషయాలు మత పెద్దలు చెబుతారు. ప్రవక్త ఇబ్రహీమ్ ఖలీలుల్లా, ఆయన తనయుడు ఇస్మాయిల్ జబీవుల్లా మధ్య జరిగిన వాస్తవ ఘటన మేరకు ఏర్పడిన ఈ పండుగ రోజున ముస్లింలు చేయాల్సిన మంచి, పుణ్య కార్యాలను వివరిస్తారు. అనంతరం దువా చేసి, సర్వ మానవాళి మంచి కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. సమాజంలో చెడు అంతం కావాలని వేడుకుంటారు. దువా పూర్తయ్యాక ఒకరినొకరు 'ఈద్ ముబారక్' చెప్పుకొని ఆలింగనం చేసుకుంటారు. దాన ధర్మాలు చేస్తారు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు పండుగ శుభాకాంక్షలు చెప్పుకొని ఇంట్లో చేసుకున్న 'దూద్ సేమియా, షీర్ ఖుర్మా, కద్దూ ఖీర్, ఖుబానీక మిఠా' లాంటి తీయ్యని వంటకాలతో వేడుక చేసుకుంటారు.

శాంతియుతంగా ..

పండక్కి ఒక రోజు ముందు ఉపవాసం (రోజా) ఉంటారు. పండుగ రోజున ఈద్ నమాజ్ చేసుకొని ఇంటికి వచ్చేంత వరకు ఎలాంటి ఆహారం, నీళ్లు తాగకుండా ఉపవాసం ఉంటే రోజా ఉన్నంత పుణ్యం లభిస్తుందని ముస్లిం మత పెద్దలు చెబుతుంటారు. ఆ తరువాత ముక్తి కోసం ఖుర్బానీ ఇచ్చి, ఇతరులకు పంచి పెట్టి భక్తి చాటుకుంటారు. ఈ పండుగను ఘనంగా శాంతియుతంగా జరుపుకునేందుకు మత పెద్దలు ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల వక్ఫ్, అధికారులు ఈద్గాహ్‌లల్లో తగిన సదుపాయాలు కల్పించారు.

అర్ధరాత్రి వరకు పదోన్నతుల కౌన్సెలింగ్

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు



రాత్రి సమయాన లైట్లు వేసుకుని పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీలకు) ప్రైమరీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రకియ శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలులోని ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ ప్రకియ జరిగింది. ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి 636 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ జాబితాలో 1 నుంచి 1000 వరకు ఉన్న ఎస్‌జీటీలను ఆహ్వానించారు. అర్ధరాత్రి వరకు పదోన్నతుల ప్రక్రియ జరిగింది. చాలా మంది ఉపాధ్యాయులు నాట్ విల్లింగ్ ఇవ్వడంతో మరుసటి రోజు కూడా పదోన్నతుల ప్రక్రియ కొనసాగనుంది. కర్నూలు, నంద్యాల జిల్లాల డీఈవో ఎస్.శామ్యూల్‌పాల్, జనార్దన్‌రెడ్డి పదోన్నతుల ప్రక్రియను పర్యవేక్షించారు. ఏడీలు సుధాకర్‌రెడ్డి, అసదుల్లా ఖాన్, సూరింటెండెంట్లు సునీల్, లక్కే నాయక్ పాల్గొన్నారు.

ఫెయిలైంది ప్రభుత్వమే!



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

కర్నూలు కల్చరల్: పదో తరగతి మూల్యాంకనంతో ఫెయిలైంది విద్యార్థులు కాదని ప్రభుత్వమేనని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో డిప్యూటీ ఈవో భూషణ్, ఏడీ అసదుల్లా ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఎలాంటి ఫీజులు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలన్నారు. తుది ఫలితాలు వచ్చే వరకు పదో తరగతి మార్కుల ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్ని రోజుల పాటు నిలిపేయాలన్నారు. మూల్యాంకన లోపాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు మణిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కటారు కొండ సాయికుమార్, నగర అధ్యక్షులు అన్వార్, నాయకులు సంతోష్, మధుమోహన్, హేమంత్, సృజల్ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 88.21 శాతం హాజరు



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు




హాల్‌టికెట్లను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయ నియామక పరీక్షలు (డీఎస్సీ) శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 88.21 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఒక్కొక్కటి, కర్నూలు నగరంలో మూడు.. మొత్తం ఐదు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 762 మందికి 673 హాజరు కాగా 89 మంది గైర్హాజరయ్యారు. 88.32 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం సెషన్‌లో 756 మందికి 666 మంది హాజరు కాగా 90 మంది గైర్హాజరు కాగా 88.10 శాతం హాజరు నమోదైంది. రెండు సెషన్‌లలో 88.21 హాజరు శాతం నమోదైంది. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. డీఎస్సీ పరీక్షలు 30వ తేదీ వరకు జరుగుతాయని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఆదేశించారు.

ఉలిక్కిపడ్డ మీదివేముల

రమేష్‌నాయుడిది ముమ్మాటికీ రాజయకీయ హత్యే!

- అధికార పార్టీ నాయకులే హత్య చేశారని మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆరోపణ
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



మీదివేముల గ్రామంలో పోలీసుల బందోబస్తు



రమేష్‌నాయుడు (ఫైల్)

పాణ్యం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌నాయుడు హత్యతో ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామం ఉలిక్కి పడింది. మృతుడు కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ గెలుపొందినా, మీదివేముల గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చింది. గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండటంతోనే ఆ పార్టీ వర్గీయుడైన, స్థానికంగా ప్రజల్లో పట్టు ఉన్న రమేష్‌ను టీడీపీ వర్గీయులే మట్టుపెట్టి ఉంటారనే చర్చ జరుగుతోంది. గతంలో కూడా రమేష్‌నాయుడు ఇంటిపై దాడికి పాల్పడ్డారు. ఇదిలాఉంటే హత్యోదంతంపై మృతుని భార్య ఆరుగురు టీడీపీ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. కాటసానితో పాటు కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి గురువారం రాత్రే మీదివేముల గ్రామం చేరుకొని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పటేల్‌తో ఘటనపై చర్చించారు.



కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

అధికారి పార్టీ నాయకుల కుట్రే: కాటసాని

రమేష్‌నాయుడు హత్య ముమ్మాటికీ రాజకీయ కారణాలతో జరిగిందేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ప్రశాంతగా ఉన్న గ్రామాల్లో హత్యలు చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. రమేష్‌నాయుడిని రాజకీయంగా ఎదుర్కొలేకనే హత్య చేశారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఈ హత్య మరో ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. గతంలో అనేక సార్లు రమేష్‌నాయుడిపై దాడులకు తెగబడ్డారని, ఈ విషయాన్ని తాము పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే ప్రాణం పోయిందన్నారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను కోరామన్నారు. రమేష్‌నాయుడి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామన్నారు.

రాజకీయంగా ఓర్వలేకనే హత్య

పోలీసులకు రమేష్ నాయుడు భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు

- ఆరుగురిపై కేసు నమోదు



తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రమేష్‌నాయుడు కుటుంబ సభ్యులు

కర్నూలు: రాజకీయంగా ఓర్వలేకనే టీడీపీ వర్గీయులు తన భర్త రమేష్ నాయుడును హత్య చేశారని భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రమేష్ నాయుడు(45)ను గురువారం రాత్రి ప్రత్యర్థులు అతి కిరాతకంగా హత్య చేయడం తెలిసిందే. రమేష్ నాయుడు భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం కర్నూలు రూరల్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మేడం రామాంజినేయులు, మేడం తిరుపాలు, మేడం నాయుడు, మేడం శ్రీనివాసులు, మేడం రాజు, బుగ్గ రాముడులపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇరు వర్గీయుల ఫోన్‌కాల్ డేటాను విశ్లేషిస్తున్నామని, రెండు రోజుల్లో హత్యకు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ శ్రేణులు మార్చురీ కేంద్రం వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది.

క్లుప్తంగా

పర్వతారోహకుడికి అర్సెల్ మిట్టల్ కంపెనీ చేయూత


సురేష్‌కు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): మార్గదర్శి–బంగారు కుటుంబం(పీ4) పథకం కింద పర్వతారోహకుడు గోనెగండ్లకు చెందిన సురేష్‌కు అర్సెల్ మిట్టల్ కంపెనీ చేయూత ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం కంపెనీ ఇచ్చిన రూ.4 లక్షల చెక్కును కలెక్టర్ తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పీ4 పాలసీ కింద రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శి–బంగారు కుటుంబం ద్వారా పేదలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్, అర్సెల్ మిట్టల్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మీకాంత్, శ్రీధర్, సీపీఓ హిమప్రభాకర రాజు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వృద్ధుడి మృతి

డోన్ టౌన్: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ప్రయాణికులు గుర్తించి ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. చివరకు విద్యార్థి సంఘం నాయకుడు శివన్న విషయం తెలుసుకుని స్ఫూర్తి సంస్థ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. సంస్థ వ్యవస్థాపకులు మధు అక్కడికి చేరుకుని మృతదేహం వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా శ్రీశైలంకు చెందిన వెంకటేష్ నాయక్(52)గా గుర్తించారు. మృతుని కుమారునికి, భార్యకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మూడు రోజులుగా బస్టాండ్ ఆవరణలో ఉన్న వృద్ధుడు శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది.

వేలంలో రూ.5.20 లక్షల ఆదాయం


బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో తలనీలాల సేకరణ హక్కు కోసం శుక్రవారం నిర్వహించిన బహిరంగవేలం ద్వారా రూ.5.20 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. మొత్తం నలుగురు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. అవుకు మండలానికి చెందిన పుల్లయ్య అత్యధికంగా పాడి దక్కించుకున్నట్లు చెప్పారు. పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జేసీబీని ఢీకొన్న కారు


దెబ్బతిన్న కారు

కొలిమిగుండ్ల: స్థానిక తాడిపత్రి రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న జేసీబీని ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. తాడిపత్రి వైపు నుంచి వస్తున్న కారు కొలిమిగుండ్లకు చేరుకోగానే రోడ్డు పక్కనే ఓ హోటల్‌కు చెందిన బోర్డుతో పాటు ఆగి ఉన్న జేసీబీని బలంగా ఢీకొనడంతో ఇన్నోవా కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

స్పెషల్ ‘అదెసివ్’ స్టాంపుల కొరత

- రిజిస్ట్రేషన్ పత్రాల నకలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు
- వినియోగదారులపై అదనపు భారం మోపుతున్న అధికారులు
- రూ.50 ఈ–స్టాంపు తెచ్చుకుంటేనే నకళ్లు జారీ చేస్తున్న వైనం



అదెసివ్ స్టాంపులు..

కర్నూలు(సెంట్రల్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ఈ–స్టాంపింగ్ పుణ్యమా అని స్టాంపుల కొరత ఏర్పడలేదు. ఈ స్టాంపింగ్ స్టాక్ హోల్డర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తే తప్పా స్టాంపుల కొరత లేదు. అయితే సబ్ రిజిస్ట్రార్, రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నకళ్లు, ఈసీలు, ఇతర సర్టిఫైడ్ కాపీలను పొందేందుకు అవసరమైన స్పెషల్ అదెసివ్ (ప్రత్యేకంగా అతికించే) స్టాంపుల కొరత ప్రస్తుతం వేధిస్తోంది. దాదాపు ఐదారు నెలల నుంచి ఆ స్టాంపుల కొరత ఉన్నా రిజిస్ట్రేషన్ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో రిజిస్ట్రేషన్ పత్రాల నకళ్లు, 1983కు ముందు కంటే ఈసీలు, ఇతర సర్టిఫైడ్ కాపీలను పొందడానికి వీలు ఉంటుంది. అయితే వాటిని పొందడానికి అదెసివ్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా, ఆయా పత్రాలను పొందేందుకు నిర్దేశించిన రుసుంను వసూలు చేస్తున్న అధికారులు స్టాంపుల కొరతను మాత్రం అధిగమించడం లేదు. నకలు పొందాలంటే రూ.500, పాత ఈసీలు పొందాలంటే దాదాపు 1200, ఇతర పత్రాలను పొందేందుకు కూడా రూ.500 నుంచి రూ.1000 వరకు రుసుంను వసూలు చేస్తారు. అయితే క్రయ, విక్రయదారులు పొందాలనుకున్న సర్టిఫైడ్ కాపీకి సంబంధించి ప్రత్యేకంగా అంటించే (అదెసివ్) స్టాంపులు లేకపోవడంతో వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. ప్రత్యేకంగా రూ.50 ఈస్టాంపు తెచ్చుకుంటే అవసరమైన కాపీని ఇస్తామని చెబుతున్నారు. దీంతో వినియోగదారుడే మళ్లీ రూ.50 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అయితే అధికారులు మాత్రం నిర్దేశించిన కాపీకి సంబంధించి మొత్తం రుసుం ఒక పక్క కట్టించుకుని మరో పక్క రూ.50 స్టాంపును అదనంగా కొనుగోలు చేసి తెచ్చుకోవాలని చెబుతుండడంతో మోసపోతున్నారు. కాగా రోజుకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 700–1000 వరకు నకళ్లు, ఈసీలు, ఇతర సర్టిఫైడ్ కాపీల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు జనం వెళ్తుంటారు. దీంతో వారిపై రోజుకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడుతుంది. అంటే నెలకు ప్రజలపై రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు అదనపు భారం పడుతుంది.

పట్టించుకోని ప్రభుత్వం...

స్పెషల్ అదెసివ్ స్టాంపుల కొరతపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. దాదాపు 6 నెలలుగా స్టాంపుల కొరత ఉంది. స్థానిక అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశతో ఉన్నారు. ఇదే సమయంలో క్రయ, విక్రయదారులకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాన్ జుడీషియల్ స్టాంపులను అందుబాటులో ఉంచుతామని చెప్పినా ఒకటి, రెండు నెలలకే స్వస్తి పలికింది. దీంతో ఈ – స్టాంపులే దిక్కయ్యాయి. అయితే ఈ స్టాంపింగ్ స్టాక్ హోల్డర్.. వెండర్లకు అవసరమైన స్టాంపులను సరఫరా చేయడం లేదు. అతను తన ఖాతాలో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన చలాన్లను కట్టిస్తేనే ఈ స్టాంపులు ఇస్తానని షరతు విధించి కొందరికే విక్రయిస్తున్నాడు. దీంతో కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల దగ్గర అప్పుడప్పుడు స్టాంపుల కొరత నెలకొని క్రయ,విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలో ఐదారు రోజులపాటు స్టాంపుల కొరత కృత్రిమంగా వచ్చినా సర్దుకుపోతున్నారు.

ఏడుగురు మట్కా బీటర్లు అరెస్ట్


మట్కా బీటర్ల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ ఎర్రిస్వామి

కోడుమూరు రూరల్: మట్కా నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులతో పాటు, ఒక మహిళను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి శుక్రవారం తెలిపారు. కోడుమూరుకు చెందిన బోయ వీరరాజనాయుడు, బోయ రెడ్డి రాజు, లింగ బలిజ విజయకుమార్, బోయ దివాకర్, కల్లపరి నాగేష్, బోయ కాశీతో పాటు, గీత అనే మహిళ పత్తికొండ రోడ్డులోని ఖాళీస్థలంలో మాట్కా ఆడుతుండగా సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 16 మట్కా చీటీలతో పాటు, రూ.2,30,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. యువత మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

మామిడికి వరుణుడి దెబ్బ

- గత నెలలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట
- పురుగు పట్టడంతో పడిపోయిన డిమాండ్
- రైతులు, వ్యాపారులకు తీవ్ర నష్టం



కర్నూలు (అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మే నెలలో కురిసిన అధిక వర్షాలతో దిగుబడి దెబ్బతినింది. అకాల వర్షాలతో పాటు గాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో కాయలు నేలరాయి కోలుకోలేక పోయారు. ఉమ్మడి జిల్లాలో 12,256 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. 2023 – 24లో ఎకరాకు సగటున 8 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ఈ సారి ఎకరాకు కేవలం 3–4 టన్నుల వరకు మాత్రమే దిగుబడి వచ్చింది. ఇది కూడా అకాల వర్షాల వల్ల రైతులకు దక్కలేదు. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా... 106.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అధిక వర్షాల వల్ల మే నెలలోనే మామిడిలో విపరీతంగా పురుగు వచ్చింది. పురుగు ప్రభావం వల్ల ధరలు పతనం అయ్యాయి. దీంతో రైతులకు నష్టాలు భరించక తప్పలేదు. సాధారణంగా మామిడి తోటలను కొందరు రైతులు పూత రావడానికి ముందే వ్యాపారులకు అమ్మేశారు. అయితే వాతావరణ పరిస్థితులతో మామిడిలో నాణ్యత దెబ్బతినడంతో వ్యాపారులు సైతం నష్టపోయారు. మామిడి టన్ను ధర మామూలుగా అయితే రూ.50 వేలకు పైగా ఉండాల్సి ఉండగా ఈ సారి టన్ను ధర రూ.20 వేల నుంచి రూ.30 వేలు కూడా లభించని పరిస్థితి నెలకొంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

- 6 ద్విచక్ర వాహనాలు, 7సెల్ ఫోన్‌లు సీజ్
- రూ. 52వేల నగదు స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి

కోసిగి: మండలంలోని పెద్దభూంపల్లి గ్రామ శివారులోని కోసిగి ఆంజనేయ పొలంలో వేప చెట్టు కింద పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేశామని కోసిగి సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందుతులను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన బలోని హనుమంతు, చిన్న ఉశేని, శివకుమార్, నాగరాజు, చాకలి శివకుమార్, రమేష్, కల్లూరి పద్మయ్య, నాగేంద్ర, జింకల మదసాబ్, మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి చెందిన వడ్డే నరసింహ, ఖాసిం, షేక్ వహాబ్, ఐరన్‌గల్ గ్రామానికి చెందిన తారాపురం రంగయ్య, జంపాపురం గ్రామానికి చెందిన చిదానంద, సి.బెళగల్ గ్రామానికి చెందిన వీరేష్ పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.52 వేల నగదు, 6 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశామని వివరించారు.

34 మంది డీటీలు, 8 మంది జూనియర్ అసిస్టెంట్ల బదిలీ

కర్నూలు(సెంట్రల్): జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లను భారీ సంఖ్యలో బదిలీ చేశారు. ఏకంగా 34 మంది డిప్యూటీ తహసీల్దార్లకు స్థానభ్రంశం కల్పించారు. దీంతో ఒకేచోట ఏళ్లుగా పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లందరూ వేర్వేరు ప్రదేశాలకు బదిలీ అయ్యారు. రాజకీయ పైరవీలతోనే ఎక్కువ మందిని బదిలీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు వివిధ రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న 8 మంది జూనియర్ అసిస్టెంట్లను కూడా బదిలీ చేశారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా తక్షణమే బదిలీ ప్రదేశంలో రిపోర్టు చేసుకోవాలని ఆమె ఆదేశించారు.

వలసబాటలో మృత్యుఒడికి..


తలారి హనుమంతు (ఫైల్)

ఆదోని రూరల్: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన ఓ యువకుడు అనంత లోకాలకు చేరుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..బల్లేకల్ గ్రామానికి చెందిన గోవింద్‌కు ముగ్గురు కుమారులు కాగా, హనుమంతు (20) చివరి వాడు. గోవిందు అనారోగ్యంతో గత కొంతకాలం క్రితం మృతిచెందగా.. ఉపాధి నిమిత్తం హనుమంతు హైదరాబాద్ వెళ్లాడు. నిర్మాణంలో ఉన్న 12 అంతస్తుల భవనంలో శుక్రవారం స్లాబ్ వేస్తుండగా కాలు జారి కింద పడ్డాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే గాయపడిన యువకుడిని సమీపంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన బల్లేకల్‌కు తరలిస్తున్నారు.

అన్ని వర్గాల వారికి రుణాలు


బాధ్యతలు స్వీకరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ద్వారా రైతులకు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తామని చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో జరిగిన కార్యక్రమంలో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొదుపు లక్ష్మి గ్రూపులకు కూడా తక్కువ వడ్డీతో రుణాలు పంపిణీ చేస్తామని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో కేడీసీసీబీ 5వ స్థానంలో ఉందని, తమ హయాంలో మొదటి స్థానంలోకి తీసుకరావడానికి కృషి చేస్తామన్నారు. కాగా.. రోడు ప్రమాదంలో మరణించిన తన కుమారుడిని గుర్తు చేసుకుంటూ విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డీసీవో ఎస్.రామాంజనేయులు, డీసీసీబీ సీఈవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక పంచాయతీ కార్యదర్శి మృతి


సుజాత(ఫైల్)

గోస్పాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక తేళ్లపురి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బొప్ప సుజాత(31) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 28వ తేదీన విధుల నిమిత్తం తేళ్లపురి గ్రామానికి మరొక పంచాయతీ కార్యదర్శితో కలసి బైక్‌పై వెళ్తుండగా.. వారి వెనుక వస్తున్న కారు హారన్ కొట్టడంతో భయాందోళనకు గురైన ఆమె బైక్‌పై నుంచి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఆమె మృతి చెందారు. పంచాయతీ కార్యదర్శిగా ఆమె మొదట్లో సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పుడు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శిగా ఉయ్యాలవాడ మండలంలో పని చేశారు. ఆ తర్వాత ఏపీపీఎస్సీ ద్వారా జరిగిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గ్రేడ్–4 కార్యదర్శిగా గోస్పాడు మండలం కానాలపల్లెలో పని చేశారు. అనంతరం జరిగిన బదిలీల్లో తేళ్లపురి గ్రామంలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందారు. ఆమె మృతి పట్ల గ్రామస్తులు, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, పీఎస్‌లు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఎంపీడీఓ అమానుల్లా రూ.15 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట ఈఓఆర్డీ నాగఅనసూయ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జనని బ్యాంకు పేరుతో మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఇద్దరు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ హనుమంతు నాయక్

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ప్రజలు సొమ్మును డిపాజిట్ల రూపంలో కట్టించుకుని చివరకు ఓ సంస్థ బోర్డు తిప్పేసి ఖాతాదారులను మోసం చేసింది. ఈ ఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. సీఐ హనుమంతునాయక్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్ల పట్టణం గడ్డవీధికి చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి 2021లో స్థానిక ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకుల కంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని నమ్మబలికించారు. వీరి మాటలు నమ్మి కోవెలకుంట్లతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఇందులో ఖాతాదారులుగా చేరి లక్షలాది రూపాయాలు డిపాజిట్ల రూపంలో జమ చేశారు. డిపాజిట్లు చేసిన కొంత మందికి లోన్ల రూపంలో డబ్బులు అందజేశారు. ఖాతాదారులు జమ చేసిన సొమ్మును స్వాహా చేసేందుకు కుట్ర పన్ని సంస్థకు సీఈఓగా ఉన్న వెంకటరమణ తన వ్యక్తిగత ఖాతాకు నగదు బదిలీ చేయించున్నాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడవు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థ యాజమాన్యం బోర్డు తిప్పేయడంతో బాధితులు ఈ నెల 4వ తేదీన కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇప్పటి వరకు ఐదుగురు ఖాతాదారులు రూ. 13.45 లక్షలు డిపాజిట్లు చేసి మోసపోయినట్లు గుర్తించారు. ఇంకా ఎవరైనా సొసైటీలో డబ్బులు జమ చేసి బాండ్ల కాల పరిమితి తీరిపోయి ఉంటే పోలీసులను సంప్రదించాలని సీఐ పేర్కొన్నారు. డిపాజిట్లపై లోన్లు తీసుకుని తిరిగి చెల్లించని ఖాతాదారులు కూడా ఈ కేసులో నిందితులవుతారని, తీసుకున్న డబ్బులను వెంటనే కట్టాలని హెచ్చరించారు. కేసులో నిందితులైన గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వివరించారు.


ఉలిందకొండ ఆర్టీసీ బస్టాండ్

ఆర్టీ‘ఛీ’ బస్టాండ్


బస్టాండ్‌లో పేరుకుపోయిన చెత్త

దివంగత నేత, మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్న హయాంలో తన సొంత గ్రామమైన ఉలిందకొండ ప్రజల కోసం ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. కానీ ఇప్పుడు బస్సులు లేక ఎక్కడికక్కడే మురికి కుంటలుగా నీరు, బస్టాండ్ అంతా తాగుబోతులకు అడ్డాగా మారింది. మద్యం సీసాలు, గ్లాసులు, చెత్తకుప్పలతో దర్శనమిస్తూ దుర్గంధం వెదజల్లుతూ కనిపిస్తోంది. ప్రస్తుతం బీవీ మోహన్‌రెడ్డి కుమారుడు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఉన్నారు. ప్రజల కోసం ఉలిందకొండ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి .

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


అపరిశుభ్రంగా..

బైక్ అదుపు తప్పి మహిళ మృతి

- మరో మహిళకు తీవ్ర గాయాలు
- అనంతపురం నుంచి రేగడగూడూరుకు వెళ్తుండగా ప్రమాదం


వైష్ణవి మృతదేహం వద్ద రోదిస్తున్న దుర్గ


ప్రమాదానికి గురైన బైక్

వెల్దుర్తి: వారిద్దరూ వరుసకు అక్కాచెల్లెలు. బంధువుల ఊరిలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దుర్గ, వైష్ణవి (30) దగ్గరి బంధువులు. వరసకు అక్కాచెల్లెలు అవుతారు. కాగా నంద్యాల జిల్లా వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామంలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొనేందుకు శుక్రవారం ప్రయాణమయ్యారు. వైష్ణవి ఆటో డ్రైవర్ కావడంతో బైక్‌పై బయలుదేరారు. బెంగళూరు – కర్నూలు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించి వెల్దుర్తి నుంచి నంద్యాల హైవే మీదుగా రేగడగూడూరు వెళ్లాలని భావించారు. ఈ ప్రయత్నంలో వెల్దుర్తి పట్టణం దాటిన తర్వాత 2 కి.మీ ప్రయాణించగా నక్కల తిప్ప వద్ద డౌన్‌లో బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వైష్ణవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. దుర్గకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని, గాయపడిన మహిళను స్థానిక సీహెచ్‌సీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలు వైష్ణవి అనంతపురానికి చెందిన రామాంజనేయులు కుమార్తె. ఈమెకు ఇంకా పెళ్లి కాలేదు. గాయపడిన దుర్గ గృహిణి, ఆమెకు భర్త శివకుమార్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.